నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 మహబూబ్‌నగర్, గురువారం 19 సెప్టెంబర్ 2024 JOGULAMBA GADWAL WANAPARTHY


దేవరకద్ర మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన ఉల్లి

# కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి

- క్వింటా ధర గరిష్ఠంగా రూ.5 వేలు
- మార్కెట్‌లో రూ.వెయ్యి పెరుగుదల

దేవరకద్ర, సెప్టెంబర్ 18 : ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తున్నది. దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ధరలు విపరీతంగా పెరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల శివారుల్లో సాగైన ఉల్లిని రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. దాదాపు 16 క్వింటాళ్లకుపైగా విక్రయానికి రాగా స్థానిక వ్యాపారులతోపాటు బయటి నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. గరిష్ఠంగా రూ.5 వేలు, కనిష్ఠంగా రూ.4,500 వరకు ధర పలికింది. గత వారం క్వింటా ధర అత్యధికంగా రూ.4 వేలకు పలకగా.. వారం వ్యవధిలోనే రూ.వెయ్యి పెరిగింది.

మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీలు తూకం వేసి విక్రయించారు. ప్రస్తుతం ఉల్లి ఉత్పత్తి లేకపోవడంతోనే రెండు వారాల్లోనే ధరలు పైపైకి చేరాయి. కాగా ధరలు పెరగడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.


స్టాల్స్‌లో వెదురు వస్తువులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కళాత్మకం.. వెదురు వస్తువులు

- మేదరుల బాగోగులు చూసింది కేసీఆర్ ప్రభుత్వమే..
- పది నెలలుగా అభివృద్ధి చేయని కాంగ్రెస్ సర్కారు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 18 : మేదరులు కళాత్మకంగా వెదురుతో తయారుచేసే వస్తువులన్నీ పర్యావరణహితమే అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేతేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మేదరుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిచ్చామని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్‌లో సంఘం భవనానికి స్థలంతోపాటు మేదరుల్లో అత్యంత పేదవారికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించామని తెలిపారు. పదేండ్లలో మహబూబ్‌నగర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. క్రిస్టియన్‌పల్లి సర్వే నెంబర్ 523 బాధితుల పక్షాన పోరాటం చేసినందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేదవారికి అండగా ఉంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్లు గణేశ్, రాము, నాయకులు సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, భాస్కర్, కిషన్ పవర్, మేదరి సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటరాముడు, గౌరవ అధ్యక్షుడు రాజేందర్, పట్టణ అధ్యక్షుడు సత్యం, యువత అధ్యక్షుడు సుధాకర్, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.


నిండుకుండను తలపిస్తున్న కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

నీలివిప్లవంపై నీలినీడలు

రాష్ట్రంలో నీలి విప్లవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వర్షాకాలం ఆరంభమై మూడు నెలలు పూర్తయినా ఇంకా చెరువుల్లోకి చేప చేరేదెన్నడో అంటూ మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని జలాశయాలు, చెరువులు, కుంటల్లో వదిలేందుకు 10 కోట్ల చేపపిల్లలు అవసరం. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండుకుండలా ఉన్నా ఉచితంగా అందించాల్సిన చేప పిల్లల టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కానేలేదు. కేసీఆర్ సర్కారు మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపితే.. కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పథకానికి మంగళం పాడడంతో మత్స్యకారుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.

- మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# ఫినిష్..!

- కాంగ్రెస్ సర్కారులో చేపపిల్లల జాడేది?
- సీజన్ ప్రారంభమై మూణ్నెళ్లు పూర్తి
- ఇంకా ఖరారుకాని చేపపిల్లల టెండర్లు
- ఉమ్మడి జిల్లాలో 10 కోట్లకుపైగా అవసరం
- నిండుకుండలా చెరువులు, రిజర్వాయర్లు
- ఉచిత చేప పిల్లల పంపిణీకి మంగళమే..
- ప్రశ్నార్థకంగా మత్స్యకారుల ఉపాధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. కృష్ణమ్మ, తుంగభద్రతో పాటు భీమా నదులు ఉప్పొంగి ప్రవహించడంతో నదీ పరివాహక ప్రాంతాలన్నీ జలసిరులను సంతరించుకున్నాయి. భారీ వర్షాలతో కుంటలు, చెరువులు, చెక్ డ్యాంలు కళకళలాడుతున్నాయి. వాగులు, వంకలు ప్రవహించడంతో అన్నదాతలు ఆనందంలో ఉన్నారు. అయితే మత్స్యకారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. పదేండ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించింది. జలాశయాలతోపాటు చిన్నచిన్న చెరువులు, కుంటలను కూడా వదలకుండా చేపపిల్లలను పంపిణీ, విడుదల చేయించి మత్స్యకారులకు ఉపాధి కల్పించింది. కానీ ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినా ఇప్పటి వరకు చేపపిల్లల పంపిణీ జాడ కనిపించడం లేదు. దీంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళనలో చెందుతున్నారు. చేపల వేట, అమ్మకం, పెంపకంపై ఆధారపడిన వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని జలాశయాలు, చెరువులకు కలిపి సుమారు 10 కోట్లకుపైగా చేప పిల్లలు అవసరమవుతాయని అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. ప్రతి ఏటా ఎండాకాలం ముగియగానే ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టేది. వర్షాకాలం ప్రారంభం కాగానే టెండర్ల ప్రక్రియ నిర్వహించి చేప పిల్లలను దశలవారీగా వదిలే కార్యక్రమాన్ని చేపట్టేవారు. కానీ ఈసారి వర్షాకాలం ముగుస్తున్నా ఇంతవరకు పంపిణీపై రేవంత్ సర్కారు ఊసెత్తడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో మత్స్యకారులకు ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు అవసరమైన చేపపిల్లల పంపిణీ కోసం టెండర్ల ప్రక్రియను నిర్వహించినా ఇంకా ఖరారు చేయలేదు. సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో బ్రేక్ పడినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో మోసం చేయడమే గాక మత్స్యకారులను ఉపాధి లేకుండా చేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

### టెండర్ల ప్రక్రియకు బ్రేక్

పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ముందస్తుగా టెండర్ల ప్రక్రియ చేపట్టింది. కానీ ఈసారి అవసరమైన చేప పిల్లల పంపిణీకి జిల్లాల వారీగా టెండర్లను ఆహ్వానించారు. చాలామంది వ్యాపారులు ఇందులో పాల్గొన్నారు. అయితే తెలంగాణకు చెందిన వ్యాపారులు కాక ఆంధ్రాకు సంబంధించిన కాంట్రాక్టర్లు పాల్గొని టెండర్లు దాఖలు చేశారు. అయితే సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఈ టెండర్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. వేసిన టెండర్లను తెరవకుండానే అధికారులు అలాగే ఉంచారు.

భారీ వర్షాలు పడి జలాశయాలన్నీ నిండుగా ఉన్నప్పటికీ చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభించేందుకు పైనుంచి ఆదేశాలు లేవని అధికారులు చెబుతున్నారు.

### 10 కోట్ల చేపపిల్లలు అవసరం

చెరువులు, కుంటలు, జలాశయాలను గుర్తించి వాటిలో ఎన్ని చేప పిల్లలు అవసరమో అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సుమారు 10 కోట్లకుపైగా చేప పిల్లలు అవసరం పడతాయని అంచనా వేశారు. జిల్లాల వారీగా ఎన్ని చేప పిల్లలు అవసరమో లెక్క తేల్చారు. అయితే రేవంత్ సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. అంతేగాక ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెరిగిన మత్స్య సంపదంతా 'ఏటికి ఎదురీది.. ఉన్నదంతా వరదల్లో ఎటో వెళ్లిపోయింది'.. అని మత్స్యకారులు అంటున్నారు. నాలుగైదేండ్లుగా మత్స్య సంపదపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలు ఈసారి చేపపిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఉపాధి కోల్పోయే పరిస్థితి దాపురించింది. స్థానికంగా ఉన్న చెరువుల్లో, కుంటల్లో చేపపిల్లలను వదిలి పెద్దయ్యాక స్థానికంగా ఉన్న మత్స్యకారులు వాటిని పట్టుకొని మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈసారి ఆ పరిస్థితి లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

### నిన్న హరితహారం.. నేడు చేప పిల్లల పంపిణీ..

కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించింది. దీంతో ఐదు జిల్లాల్లో పచ్చదనం పరిఢవిల్లింది. అలాగే కులసంఘాలకు సైతం చేయూతనిచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటికి మంగళం పాడింది. మొక్కుబడిగా అక్కడక్కడ మొక్కల పెంపకం చేపట్టింది. గ్రామాల్లోని నర్సరీలు.. మండల కేంద్రాల్లోని ప్రకృతి వనాలు.. జిల్లా కేంద్రాల్లోని అటవీశాఖ నర్సరీలన్నింటిపై తీవ్ర ప్రభావం పడింది. ఉపాధి పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీలు ఉంచుతారో..? ఊడగొడుతారో..? తెలియని పరిస్థితి నెలకొన్నది. నేడు మత్స్యకారులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టింది. బీసీ వర్గాల్లో ముదిరాజ్ సామాజిక వర్గం మత్స్య సంపదను కాపాడడంలో ముందుంది. ఆ సామాజిక వర్గం ఉపాధిపై కొత్త సర్కారు ఉక్కుపాదం మోపింది. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం మేల్కొని తమను ఆదుకునేందుకు చేప పిల్లలు పంపిణీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఆందోళనలు తప్పవని మత్స్యకార సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

### ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది..

మత్స్యకారులను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం తమను ఆదుకునేందుకు వందశాతం సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేసింది. ఉచితంగా వాహనాలను అందజేసింది. భారీ వర్షాలతో ప్రస్తుతం అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. అయినా, అధికారులు చేపపిల్లలను పంపిణీ చేయడం లేదు. వరదల కారణంగా ప్రాజెక్టుల్లో ఇదివరకు ఉన్న చేపలు ఎదురీది వెళ్లిపోవడంతో మత్స్యకార్మికులకు ఉపాధి సైతం కరువైంది. తాము బతుకుదెరువు కోసం వలస బాట పట్టాల్సి వస్తున్నది.

- శ్రీనివాసులు, మత్స్య కార్మికుడు, మల్లేపల్లి

### కాంట్రాక్టర్లు ముందుకురాలే..



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టులు, చెరువుల్లో చేపల పెంపకానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. చేపపిల్లల విడుదలకు సంబంధించి ఫిషరీస్ డిపార్డ్‌మెంట్ ద్వారా జూలై 20, ఆగస్టు 2, 23వ తేదీల్లో టెండర్ల ప్రక్రియ చేపట్టినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఆలస్యమైంది. 12 జిల్లాల్లో రీటెండర్ నిర్వహించేందుకు నోటిఫికేషన్ రిలీజ్ చేశాం. గురువారం 3:30 గంటల తర్వాత టెండర్లు తెరుస్తాం. ప్రక్రియ పూర్తయిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన మత్స్య కార్మికులకు పూర్తి సబ్సిడీపై చేపపిల్లలను అందజేస్తాం.

- వెంకయ్య, డీఎఫ్‌వో, నారాయణపేట జిల్లా

### ఆలస్యంగా వదిలితే నష్టమే..



ఊట్కూర్ పెద్ద చెరువుకు జూలైలోనే సగం మేర నీళ్లు వచ్చాయి. అప్పటినుంచి చేపలు వదలాలని మత్స్య శాఖ అధికారులను కోరుతున్నాం. ఇంతవరకు చేపపిల్లలను పంపిణీ చేయలేదు. ఆలస్యంగా వదిలితే పిల్లలు పెరగక సరైన ధర రాదు. దీంతో సంఘం ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వం సంఘాలకు సకాలంలో చేపపిల్లలను పంపిణీ చేసింది. అంతేకాకుండా తమను అన్నివేళలా ఆదుకున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో చేపలు వదిలితే కొంతైనా లాభం చేకూరుతుంది.

- ఎం.నరేశ్, మత్స్య సహకార సంఘం డైరెక్టర్, ఊట్కూర్


కొల్లాపూర్ ప్రభుత్వ ఏరియా దవాఖానను తనిఖీ చేస్తున్న మంత్రి జూపల్లి

# కొల్లాపూర్ దవాఖానకు రూ.25 లక్షలు

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రభుత్వ వైద్యశాల తనిఖీ, వైద్యులపై ఆగ్రహం

కొల్లాపూర్, సెప్టెంబర్ 18 : కొల్లాపూర్ దవాఖాన అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. బుధవారం పట్టణంలోని ఏరియా దవాఖానను మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో సూపరింటెండెంట్, వైద్యులు విధులకు రాకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేసి వారి నుంచి వివరణ తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి స్వరాజ్యలక్ష్మిని ఆదేశించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. దవాఖానలోని పలు విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# ఉద్యోగి చేతివాటం!

- ఇండ్లను రెగ్యులరైజ్ చేస్తానంటూ పైసా వసూలు
- రూ.32 లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారణ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్

కల్వకుర్తి, సెప్టెంబర్ 18 : కల్వకుర్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న తాత్కాలిక (ఔట్ సోర్సింగ్) ఉద్యోగి చేతివాటానికి పాల్పడ్డాడు. కొత్తగా మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అధికారి బల్దియాకు సంబంధించిన ఆదాయ, వ్యయాలను పరిశీలిస్తుండగా.. విషయం వెల్లడైనట్లు సమాచారం. దాదాపు రూ.32 లక్షల వరకు సదరు తాత్కాలిక ఉద్యోగి స్వాహా చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. దాదాపు 18 నెలల కిందట బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ వెంట తాత్కాలిక ఉద్యోగి కూడా వచ్చాడు. తాత్కాలిక పద్ధతిన టౌన్ ప్లానింగ్ విభాగంలో చేరాడు. ఇక్కడే పనిచేస్తున్న సదరు తాత్కాలిక ఉద్యోగిపై చాలా ఆరోపణలు ఉన్నాయి. విషయానికి వస్తే వారం కిందట కల్వకుర్తిలో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా కమిషనర్ షేక్ వచ్చారు. బాధ్యతలు తీసుకున్న ఆయన మున్సిపాలిటీకి చెందిన ఆదాయ, వ్యయాలకు సంబంధించిన ఫైల్ చూస్తుండగా టౌన్ ప్లానింగ్ విభాగంలో పలు అనుమానాలు వచ్చాయి. డబ్బులు టౌన్ ప్లానింగ్ ఖాతాలో జమ కాలేదని గుర్తించారు. దాదాపు రూ.32 లక్షలు వరకు సదరు తాత్కాలిక ఉద్యోగి స్వాహా చేసినట్లు తెలుసుకొని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అనుమతులు లేకుండా నిర్మించుకున్న పెంట్ హౌస్, షెట్టర్లు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకున్న ఇళ్లకు నోటీసులు జారీ చేసి.. ఆ తర్వాత వాటిని రెగ్యులరైజ్ చేసేందుకు వీలుగా విధించిన జరిమానాలకు రసీదులు ఇచ్చారు. ఆ డబ్బును సదరు తాత్కాలిక ఉద్యోగి స్వాహా చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా.. నిజమేనని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# సా..గుతున్న రుణమాఫీ!

- వనపర్తి జిల్లా వ్యాప్తంగా 6,180 మంది రైతుల వివరాలు నమోదు
- ఇంకా రెండు వేల కుటుంబాలు పెండింగ్..
- గ్రామసభలు నిర్వహించినా అర్హులను గుర్తించని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

వనపర్తి, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యవసాయ రుణమాఫీ పూర్తి స్థాయిలో కాకపోవడంతో రైతుల్లో అయోమయం.. గందరగోళం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు లోన్లు మాఫీ చేశామని ఆర్భాటంగా ప్రకటించింది. కానీ పలు ప్రాంతాల్లో వివిధ కారణాలతో ఇంకా చాలా మందికి వర్తించకపోవడంతో కర్షకులకు ఎదురుచూపు తప్పడం లేదు. అర్హత ఉండి మాఫీ కాని రైతులు పలుచోట్ల ఆందోళనలు కూడా చేపట్టారు. మాకెందుకు మాఫీ చేయరంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒకే కుటుంబంలో చిచ్చు పెట్టినట్లు రుణమాఫీ రణరంగాన్ని తలపిస్తుంది. ఈ పరిణామాలతో స్పందించిన ప్రభుత్వం రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు గ్రామ స్థాయిలో సభలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయాలు, రైతు వేదికల్లోనూ నిర్ధారణ ప్రక్రియలకు చెందిన వివరాల దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇదిలా ఉంటే, వనపర్తి జిల్లాలో తొలివిడుతలో 27,066 మందికి రూ.145.55 కోట్లు, రెండో విడుతలో 16,527 మందికిగానూ రూ.154.58 కోట్లు, మూడో విడుతలో 10,047 మందికి రూ.126.62 కోట్లు మాఫీ అయ్యాయి. ఇలా మొత్తం జిల్లా వ్యాప్తంగా 53,640 మంది రైతులకుగానూ రూ.426.76 కోట్లు ఇప్పటి వరకు మాఫీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలు సరిగా లేని వారికి రుణమాఫీ ఆర్థిక సాయం అందలేదు. జిల్లాలో 8,127 మంది రైతులకు సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో ఏవో,ఏఈవోలు గ్రామాలు తిరుగుతూ ఇప్పటివరకు 6,180 మంది కర్షకులను సంప్రదించి సమాచారాన్ని నమోదు చేశారు. ఇంకా దాదాపు 2 వేల మంది రైతులు పెండింగ్‌లో ఉన్నారు. రుణమాఫీ కానివారి వివరాలు సేకరించేందుకు అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. అక్కడే రైతు కుటుంబం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చారు. వ్యవసాయ అధికారులు, ఏఈవోలు కుస్తీ పడుతున్నా.. ఇంకా దాదాపు జిల్లాలోని 14 మండలాల్లో నమోదు ప్రక్రియ పెండింగ్‌లోనే చూపుతుంది. ముందస్తుగా ప్రకటించిన గడువు ఎప్పుడో ముగిసింది. అయినా ఇంకా నమోదు ప్రక్రియ సాగుతూనే ఉన్నది.


చిన్నంబావి మండలం పెద్దదగడలో రుణమాఫీ ప్రక్రియలో సెల్ఫీతో సమాచారం నమోదు చేస్తున్న ఏఈవో సాయిరెడ్డి

### అర్హుల వివరాలు సేకరిస్తాం

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రైతు కుటుంబాల నిర్ధారణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఏడీఏలు, ఏవో, ఏఈవోలు గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి సేకరించిన సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. సమయానికి అందుబాటులో లేని రైతులు కార్యాలయానికి వచ్చి వివరాలు తెలియజేసేలా అవకాశం కల్పించాం. ఇతర ప్రాంతాలు, విదేశాల్లో ఉన్న వారి వివరాల నమోదు కొంత ఇబ్బందిగా మారింది. పెండింగ్‌లో ఉన్న రైతుల వివరాల నమోదును త్వరలోనే పూర్తి చేయిస్తాం.

- గోవింద్‌నాయక్, డీఏవో, వనపర్తి

# విషాదం నింపిన యాత్ర

- కాబోయే భర్తతో కలిసి సాగర్ డ్యాంకు వెళ్లిన మహిళా కానిస్టేబుల్
- కారును లారీ ఢీకొనడంతో మృతి
- ఎస్పీ శ్రీనివాసరావు సంతాపం


శ్రావణి (ఫైల్)

గద్వాల అర్బన్/కేటీదొడ్డి, సెప్టెంబర్ 18 : సరదాగా వెళ్లిన యాత్ర విషాదం నింపింది. నాగర్జునసాగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి చెందింది. వివరాలిలా.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన శ్రావణి (27) కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. ఆమెకు ఇటీవలే ఎంగేజ్‌మెంట్ కాగా.. కాబోయే భర్తతో కలిసి బుధవారం నాగార్జునసాగర్ డ్యాం చూడటానికి కారులో వెళ్లింది. ప్రాజెక్టు సమీపంలో దెయ్యాల గండి వద్ద ఆగి ఉన్న వీరి కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో శ్రావణి అక్కడికక్కడే మృతి చెందింది. శ్రావణి మృతి విషాదకరమంటూ ఎస్పీ తోట శ్రీనివాసరావు, ఎస్సై శ్రీనివాస్, పోలీసులు సంతాపం తెలిపారు.

# కనిపించకుండాపోయిన కూతురు

- మనస్తాపంతో తల్లి ఆత్మహత్య


అంజలి (కూతురు)

హన్వాడ, సెప్టెంబర్ 18 : మండలంలోని షేక్‌పల్లికి చెందిన మొగులయ్య, నర్సమ్మ (40) దంపతులు. కొన్ని నెలల కిందట వీరి కూతురు అంజలికి కొత్తపేటకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. అయితే అత్తగారి ఇంటి నుంచి ఈనెల 16వ తేదీన సాయంత్రం 5 గంటలకు వెళ్లిపోయింది. రెండ్రోజులుగా బంధువులు, తెలిసిన వారి ఇండ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఆచూకీ లభిస్తే 8712659339 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కాగా కన్నబిడ్డ కనిపించకుండాపోయిన విషయం తెలుసుకొన్న తల్లి నర్సమ్మ మనస్తాపంతో 17న సాయంత్రం షేక్‌పల్లి సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# అభిమాన హీరో కోసం..

- మక్తల్ నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర
- రామ్‌చరణ్‌ను కలిసేందుకు వినూత్న రీతిలో..



పాదయాత్ర చేపట్టిన శ్రీహరి

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 18 : అభిమానం అంటే ఇలా ఉండాలి.. ఇందులో ఒక్కొక్కరూ వారి వారి స్టైల్‌లో ప్రదర్శిస్తుంటారు. అచ్చం అలాగే నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిట్యాలకు చెందిన శ్రీహరి తన అభిమాన హీరోపై ఉన్న ప్రేమను చాటాడు. రామ్ చరణ్ అంటే ఇష్టమని, ఆయన్ను ఎలాగైనా కలవాలన్న కోరికతో మక్తల్ నుంచి హైదరాబాద్‌కు వరకు పాదయాత్ర చేపట్టాడు. రామ్ అంటే చాలా ఇష్టమని, తనకు సొంత ఇమేజ్ లేదు.. పత్రిక, సోషల్ మీడియా ద్వారా తన ప్రయత్నం ఆయన వరకు చేరుతుందని యాత్ర చేపట్టినట్లు తెలిపాడు. ఈ యాత్ర బుధవారం మహబూబ్‌నగర్‌కు చేరగా.. రామ్‌చరణ్ అభిమానులు, యువకులు శ్రీహరితో సెల్ఫీ దిగి స్వాగతం పలికారు.


వ్యవసాయ పొలాల నుంచి బైక్‌లపై బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న ఊటకుంట తండా వాసులు

# నీటి కోసం తండ్లాట

- ఊటకుంట తండాలో దాహం దాహం
- నెల రోజులుగా సరఫరా కాని మిషన్ భగీరథ నీళ్లు

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 18 : మండలంలోని ఊటకుంట తండా గ్రామ పంచాయతీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నది. నెల నుంచి తండాకు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడం లేదని స్థానికులు వాపోయారు. కేవలం వారంలో ఒకటి, రెండ్రోజులు మాత్రమే నీటి సరఫరా ఉంటుందని, దీంతో వ్యవసాయ బోర్ల వద్దకు మహిళలు పరుగులు పెడుతున్నారు. ఈ విషయమై లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లినా ప్రెషర్ తక్కువగా ఉన్నదని, అందుకే సక్రమంగా సరఫరా కావడం లేదని చెబుతున్నారని మాజీ సర్పంచ్ సీతమ్మావెంకట్‌నాయక్, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండ్రోజుల్లో పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం, ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఎంపీడీవోను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.